క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

రేపు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ

దేవరపల్లి: గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లో 2025–26 వార్షిక ప్రణాళికలను తయారు చేయుటకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించుటకు ప్రణాళికా బద్ధమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుటకు ప్రణాళిక సుస్థిరతపై ఈ నెల 30న మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ జరుగుతుందని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ జరుగుతుందని, మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు. సభ్యులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

1న సీఎం పర్యటన



దొమ్మేరు ఏర్పాట్లుపై ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, ఎస్పీ డి.నరసింహా కిశోర్

కొవ్వూరు: వచ్చే నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దొమ్మేరులో పర్యటించనున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన విచ్చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటించారు. దొమ్మేరులో గృహ ప్రవేశం కార్యక్రమం, ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మంగళవారం పట్టణంలో ఆరికిరేవుల రోడ్డులో ఉన్న గృహ సముదాయాల లేఅవుట్ (జగనన్న కాలనీ) తదితర ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్, జేసీ ఎస్.చిన్నరాముడులతో కలిసి పరిశీలించారు. అనంతరం కొవ్వూరు, దొమ్మేరులో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రాజబాబుతో కలిసి పర్యటించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన సభ ఏర్పాట్లకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా ఖరారు కావాల్సి ఉందని కలెక్టర్ వెల్లడించారు. ఆర్డీవో రాణి సుస్మిత, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, డీఎస్పీ జి.దేవకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు ఇవ్వాలి

నిడదవోలు: నిడదవోలు రైల్వేస్టేషన్‌లో జన్మభూమి, లోకమాన్యతిలక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు కల్పించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, చింతల బాలాజీ, సుంకర నరసింహారావు, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తకు సత్కారం



మంగరాజును సత్కరిస్తున్న ఆశా కార్యకర్తలు

నిడదవోలు: కోవిడ్ సమయంలో ఉత్తమ సేవలందిన నిడదవోలు పట్టణానికి చెందిన ఆశా కార్యకర్త పి.మంగరాజు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఆశావర్కర్‌గా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా కార్యకర్త పి.మంగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, హేమలత, నాగలక్ష్మీ జ్యోతి, దేవీ, విజయ, మణి, సత్యవతి, సర్వేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మానవ హక్కులను కాపాడాలి

దేవరపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవ హక్కులను కాపాడాలని మానవ హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు మంగళపల్లి హుసేన్ విజ్ఞప్తి చేశారు. మానవ హక్కులపై దేవరపల్లిలో జరిగిన మంగళవారం అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామాన్య, నిరుపేదలకు న్యాయం జరగాలంటే రాజ్యాంగాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. అప్పుడే మానవ హక్కుల ఉల్లంఘన జరగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ సెల్ అధ్యక్షులు ఎండీ సలీమా, జిల్లా అధ్యక్షులు ఎస్‌కే షఫిక, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



ముక్కామలలో నక్కల కాలువ గట్టుపై ఒరిగిన విద్యుత్ స్తంభం



ముక్కామల ఆర్‌అండ్ బీ రోడ్డుపై ఉన్న విద్యుత్ తీగలపై వాలిన కొబ్బరి చెట్టు



పెరవలి పెట్రోల్ బంక్ పక్కనే చేలో ఒరిగిన విద్యుత్ స్తంభం

భయం భయంగా..

- కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు
- ప్రమాదకరంగా ఫ్యూజ్ కారియర్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

పెరవలి: పల్లెల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. పక్కకు ఒరిగిపోయి, శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ప్రమాదం పొంచి ఉందని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

లిఖిత పూర్వకంగా ఇచ్చినా..

ఒరిగిన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియక భయం భయంగా ఉండాల్సి వస్తోందని, రాత్రిళ్లు ఏ రైతు విద్యుదాఘాతానికి గురికావాల్సి వస్తుందాని ఆందోళన చెందుతున్నారు. పెరవలి వైపు నుంచి ముక్కామల వచ్చే విద్యుత్ లైను నక్కల కాలువ గట్టుపై ఉన్న స్తంభాలు ఒరిగిపోయి తీగల పట్టుపై అలా నిలబడి ఉన్నాయి. తీగలు ఏమాత్రం తెగినా విద్యుత్ వైర్లు, స్తంభం పంట చేలల్లోను, కాలువలోను పడి విద్యుత్ ప్రవహిస్తుందని ఆ సమయంలో చేలో రైతులు, కూలీలు ఉంటే విద్యుదాఘాతానికి బలవ్వాల్సి ఉంటుంది. దీనిపై స్థానిక లైన్‌మేన్‌లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, దీనిపై విద్యుత్ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలిపినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాలివీ...

మూడేళ్ళ క్రితం కాకరపర్రు గ్రామంలో విద్యుత్ లైన్లు సరి చేస్తుండగా సరఫరా ఉండడంతో ఒక వ్యక్తి విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనే ప్రాణాలు కోల్పోయాడు. ఆరేళ్ల క్రితం ఉసులుమర్రులో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు బలైపోయారు. అదే ఏడాది జూలైలో ఉసులుమర్రులో వ్యవసాయ మోటార్ స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై ఒక రైతు ప్రాణాలు కోల్పోయాడు. కానూరులో విద్యుత్ తీగలు తెగిపడడంతో తండ్రికొడుకులు, నాలుగు గేదెలు విద్యుదాఘాతానికి బలి అయ్యారు. జూలైలో తీపర్రులో వ్యవసాయ మోటార్ ఆఫ్ చేయడానికి వెళుతుంటే విద్యుత్ తీగలు తగిలి ఒకరు ప్రాణాలు విడిచారు. ఇలా ప్రతి ఏడాది విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

పెరవలి మండలంలో విద్యుత్ ఘాతానికి బలైపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. రైతులు నిత్యం పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేసుకోవడానికి రాత్రి, పగలు రావాల్సి ఉండగా ఈ విద్యుత్ స్తంభాలు వలన రాత్రి సమయాల్లో రావడానికి భయపడుతున్నారు. రాత్రి సమయంలోచేలకు నీరు పెట్టుకోలేక పంటలు ఎండిపోయినా ఫర్వాలేదని రైతులు చేలను వదిలివేస్తున్నారు. అనుకోని విధంగా విద్యుత్ స్తంభం కూలిపోతే ప్రాణాలు కోల్పోవాల్సి ఉంటుందని అందు వలనే పంటలు పోయినా ఫర్వాలేదు కానీ ప్రాణాలు కోల్పోకూడదని పొలాలు వెళ్లడం మానివేశామని రైతులు చెబుతున్నారు. అంతే కాకుండా గ్రామాల్లో ఫ్యూజ్ కారియర్లు రోడ్డుకి కేవలం రెండు నుండి మూడు అడుగుల ఎత్తులో ఉన్నాయి వీటిని చిన్న పిల్లలు పట్టుకుంటే ప్రాణాలు పోతాయని గ్రామస్తులు ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ఆందోళనే..



విద్యుత్ స్తంభాలు గ్రామాల్లో ఒరిగిపోయి ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిత్యం ఆందోళన చెందుతున్నాం, అధికారులు పట్టించుకోవటం లేదు, ప్రమాదం జరిగినప్పుడు మాత్రం స్పందిస్తున్నారు. తప్ప తర్వాత పట్టించుకోవడంలేదు. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టంలేదు.

–గొల్ల అర్జున్, వినియోగదారుడు తీపర్రు

ఎప్పుడు కూలుతుందో..



పంట చేలల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒరిగి ఉన్న స్తంభాలు కేవలం విద్యుత్ వైర్లు ఆదారంగా ఉన్నాయి. ఎప్పుడు కూలుపోతుందో తెలియటం లేదు, అదే జరిగితే రైతులు ప్రాణాలు పోతాయి. గతంలో మండలంలో ఎన్నో సంఘటనలు జరిగాయి. అధికారులు చర్యలు చేపట్టాలి.

–కాపకా పాపారావు, వినియోగదారుడు కాకరపర్రు

వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ అన్సారి ఫయాజ్

నిడదవోలు: క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్టు నిడదవోలు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్సారి ఫయాజ్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ప్రధానమంత్రి టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రీచ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏడుగురికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్సారి ఫయాజ్ మాట్లాడుతూ క్షయ రోగులందరూ క్రమం తప్పకుండా మందులు వాడడంతో పాటు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. రీచ్ ప్రాజెక్టు సంస్థ వారు టీబీ పేషెంట్లను దత్తత తీసుకొని పోషకాహార కిట్లు అందజేయడం అభినందనీయమన్నారు. క్షయ వ్యాధి నివారణకు మందులు వాడుతున్న వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పోషకాహార నిమిత్తం ప్రతినెల రూ.1000 డీబీటీ ద్వారా అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రీచ్ ప్రాజెక్టు డిస్టిక్ కోఆర్డినేటర్ జేవీజీఎన్ వర్మ, స్టాఫ్ నర్స్ ఇ.హెబ్సిబా, టీబీ సూపర్‌వైజర్ ఆర్.పోతురాజు, ఆరోగ్య కార్యకర్త ఎం.రాంబాబు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన

చాగల్లు: గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పశువైద్యశాల వద్ద లేగ దూడల అందాల ప్రదర్శన, పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. పాడిరైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం లేగ దూడల ప్రదర్శనలో ప్రథమ బహుమతిగా సంసాని శ్రీనుకు చెందిన ముర్ర దూడ, ద్వితీయ బహుమతి మేకా సుబ్బారావు చెందిన దూడ తృతీయ బహుమతి ఆళ్ల గాం. దీగా ఒంగోల్ దూడకు అందించారు. ప్రోత్సాహక బహుమతి జుట్టా కృష్ణమూర్తికి చెందిన పుంగనూరు దూడకు లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 52 మంది పాడి రైతులకు స్టీల్ పాల క్యాన్లు పంపిణీ చేశారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ టీ శ్రీనివాసరావు, ఉప సంచాలకులు డా.సత్యనారాయణ, సహాయ సంచాలకులు డా.వెంకటరెడ్డి, మండల పశువైద్యాధికారి డా.యు.ముఖేష్, ఈఓ డాక్టర్ జేసురత్నం, డాక్టర్ ఎం.రాజేష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెరవలి మండల అధికారులకు అవార్డుల పంట



ఏలూరులో జిల్లా కలక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదుగా ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

పెరవలి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెరవలి మండలానికి అవార్డుల పంట పండింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పెరవలి మండలం ముక్కామల, తీపర్రు గ్రంథాలయాల అధికారులు ఎం.వెంకటేశ్వరావు, జయలక్ష్మిలకు వచ్చాయి. ఈ ఉత్తమ అవార్డులు ఏలూరు జిల్లా కలక్టర్ వెట్రి సెల్వి చేతుల మీదుగా ఈ ఇద్దరు అందుకున్నారు. అలాగే వెలుగు ఏపీఎం బండారు రామకృష్ణ, కానూరు సచివాలయం సర్వేయర్‌కు, పిట్టల వేమవరం వీఆర్వో వెంకటేశ్వరరావు ఉత్తమ అధికారులుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. దీంతో జిల్లా గ్రంథాలయాధికారి ఎం.శేఖర్ బాబు, పెరవలి ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, వివిధ శాఖల అధికారులు అవార్డులు అందుకున్న అధికారులను అభినందించారు.

ఘనంగా లజపతిరాయ్ జయంతి



లాలా లజపతిరాయ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు: పట్టణంలో ఇందిరానగర్ ఎల్ఎల్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం లాలా లజపతిరాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ లాలా లజపతిరాయ్ దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రిటైర్డు పీఈటీ అల్లూరి గాంధీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బండి ప్రసాద్, ఐఎఫ్‌టీయూ నాయకులు పి.సువర్ణరాజు, హెచ్ఎం కె.కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు



ప్రశ్నపత్రాల బండిల్స్ అందజేస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్ – 3 పరీక్షలు ప్రారంభమయ్యాయని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్ నుంచి ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ప్రశ్నపత్రాల బండిల్స్ అందజేశారు. ప్రతిరోజు పరీక్ష సమయానికి గంట ముందుగా ప్రశ్నపత్రాల బండిల్స్‌ను ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేస్తామన్నారు. ఎవరైనా ప్రధానోపాధ్యాయులు రాలేని పక్షంలో ఒక ఉపాధ్యాయునికి ఆథరైజేషన్ లెటర్ ఇచ్చి పంపిస్తేనే ఇవ్వడం జరుగుతుందన్నారు. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలని, మిగిలిన ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆయా ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఈ పరీక్షల్లో కొన్ని జవాబులు ఓఎంఆర్ షీట్‌లపై గుర్తించాల్సి ఉంటుందని, విద్యార్థులందరికీ వారి పేర్లతో ఓఎంఆర్ షీట్లను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు తెలిపారు. ఎవరికైనా తక్కువ వస్తే, బఫర్ ఓఎంఆర్‌లను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ దేవా అనిత, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బిసీడి ప్రసాద్, ఇందిర, కుమారి, కోటేశ్వరి, నాగలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 250 మంది విద్యార్థులకు రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు బత్తిన రాజరాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం.ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ ఫౌండర్ సెక్రటరీ మతల రమేష్, అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ, ల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరణకు కృషి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాధవరావు వెల్లడి
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన అధికారుల బృందం



దొమ్మేరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మాధవరావు, ఇతర అధికారులు

కొవ్వూరు: సహజ సిద్ధమైన విధానాలతో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. మండలం వ్యాప్తంగా పలు గ్రామాల్లో మంగళవారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న క్షేత్రాలను డిస్ట్రిక్ ఇండస్ట్రీరియల్ సెంటర్ ఇంటర్నల్ ప్రాజెక్టు అధికారి (డీఐసీ ఐపీవో) టీవీ ప్రకాశరావు, ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ అదనపు డీజీఎం మహబూబ్ వలీలతో కలిసి పరిశీలించారు. కలుషిత రహిత, నాణ్యతతో కూడిన పంటలు ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యం అన్నారు. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించిన వాటిలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి సాధించవచ్చునని సూచించారు. దొమ్మేరులో నీరుకొండ శేషారావు పొలంలో పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను, నీరుకొండ సత్యనారాయణ పొలంలో చెరుకు, అరటి, బొప్పాయితో పాటు వివిధ రకాలైన పంటలను పరిశీలించారు. ఐ.పంగిడి గ్రామంలో పాకా వెంకటేశ్వరరావు పొలంలో డ్రోన్ ద్వారా దశపర్ని కషాయం, అగ్నస్త్రం, మీనామృతం స్ప్రే చేయించారు. కాపవరం గ్రామంలో రామకృష్ణ అనే రైతు పొలంలో ఏటీఎం మోడల్, ఐ.పంగిడిలో పోషక వాటిక, ధర్మవరంలో బయో కల్చర్ కషాయాలు తయారీతోపాటు అక్కడ పెంచుతున్న పలు రకాల పండ్ల మొక్కలను పరిశీలించారు. రైతులకు పలు రకాల సూచనలు చేశారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- నగరంలో బైక్ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పిలుపు ఇచ్చారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఆర్టీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, జిల్లా రవాణా అధికారి ఎం.సురేష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌తో పాటు లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. జిల్లాలో 2023లో జరిగిన 849 ప్రమాదాల్లో 329 మంది, 2024లో జరిగిన 728 ప్రమాదాల్లో 298 మృతి చెందారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో కార్పొరేట్, సామాజిక బాధ్యతలో భాగంగా వివిధ బ్యాంకులు, రోటరీ క్లబ్, హార్లిక్స్ ఫ్యాక్టరీ, తదితర సంస్థల ద్వారా సేకరించిన 550 హెల్మెట్లను ద్విచక్ర వాహనచోదకులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తూ, బైక్ ర్యాలీ నిర్వహించడంపై ఆర్టీవో అధికారులను అభినందించారు. ప్రమాదాల బారిన పడినవారు తలకు దెబ్బ తగిలి అచేతనంగా, మంచానికే పరిమితం అయ్యే సందర్భాలు ఉన్నాయన్నారు.

మానవ అక్రమ రవాణాపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు

కంబాలచెరువు: మానవ అక్రమరవాణాపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల కేసులపై సంబంధిత అధికారులతో చర్చించా రు. ప్రకాశ్ బాబు మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపక పోవడం, అదే సమయంలో అపరిచితులతో స్నేహాల వల్ల ఎక్కువ మంది అక్ర మ రవాణాకు గురవుతున్నారన్నారు. కుటుంబ సభ్యు లతో ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులువుగా లభించదని, అలా తప్పిపోయిన పిల్లల పరిస్థితి ఆందోళనకరంగా మారు తుందన్నారు. ఆచూకీ తెలియని పిల్లలు, తప్పిపోయిన వారిని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్య లను వివరించారు.